# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- అవినీతికి తావులేకుండా ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలను రూపొందించి, అందిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు.
- పరీక్ష పే చర్చా కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇచ్చిన సూచనలు, సలహాల పట్ల పలువురు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- దేశ భద్రత, తీర ప్రాంత రక్షణపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన వందేమాతరం కోస్ట్ గార్డ్ సైక్లోథాన్-2026 ఈ సాయంత్రం విశాఖ సాగతీరానికి చేరుకుంది.
- జింబాబ్వేలోని హరారే వేదికగా జరుగుతున్న అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, ఇంగ్లాండ్ ముందు 412 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది.

====================

ఎటువంటి అవినీతికి తావులేకుండా ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పట్టాదారు పాస్ పుస్తకాలను రూపొందించి, అందిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం, కలగట్లలో మీ భూమి-మీ హక్కు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఈరోజు ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పేందుకు మీ భూమి-మీ హక్కు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాయలసీమను ఉద్యాన హబ్ గా మార్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి నీరిచ్చి, శ్రీశైలం నీటిని రాయలసీమ ప్రాంతానికి మళ్లిస్తున్నామని అన్నారు. ఎమ్మిగనూర్ లో టెక్స్ టైల్ పార్క్ ను కూడా త్వరలోనే పూర్తిచేసి అనేక మందికి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. 44 వేల కోట్ల రూపాయలు గురు రాఘవేంద్ర ప్రాజెక్టు కోసం కేటాయించామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్…32 సెకన్లు)

====================

దేశ భద్రత, తీర ప్రాంత రక్షణపై అవగాహన కల్పించేందుకు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సి.ఐ.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వందేమాతరం కోస్ట్ గార్డ్ సైక్లోథాన్-2026 ఈ సాయంత్రం విశాఖపట్నం సాగతీరానికి చేరుకుంది. ఆర్.కె బీచ్ లో ఈ సైకిల్ యాత్రకు కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్వాగతం పలికారు. వందేమాతరం గీత రచనకు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ – 2026 కు శ్రీకారం చుట్టారు. సురక్షిత తీరాలు – సమృద్ధ భారతం అనే నినాదంతో చేపట్టిన ఈ సైక్లింగ్ యాత్ర దేశవ్యాప్తంగా 9 తీర ప్రాంత రాష్ట్రాల మీదుగా సుమారు 6 వేల 500 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. రాష్ట్రంలో 8 రోజుల పాటు 964 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర సాగుతుంది. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లో నివసించే మత్స్యకారులను దేశ భద్రతలో భాగస్వాములుగా మార్చడంతో పాటు, అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తత పెంపొందించడమే ఈ సైకిల్ యాత్ర ఉద్దేశం.

====================

నాణ్యమైన విద్యుత్ కోసం రాష్ట్రంలో పెద్ద ఎత్తున నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని కసినపల్లిలో 3కోట్ల 60 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన సబ్ స్టేషన్ ను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గిద్దలూరులోని 132/33 కేవీ సబ్ స్టేషన్ మంత్రి సందర్శించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆర్డీఎస్ఎస్ ద్వారా 650 కోట్ల రూపాయల నిధులతో ఫీడర్ లెవల్ బైఫర్ కేషన్ పనులు చేపట్టామని చెప్పారు. జిల్లాలో ఆర్డీఎస్ఎస్ పనులను 65 శాతం పూర్తిచేశామన్నారు. బయోగ్యాస్, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేస్తామని మంత్రి వివరించారు.

=====================

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) కార్యనిర్వహణాధికారిగా ముద్దాడ రవిచంద్ర ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, శ్రీవారి భక్తుడిగా ఎంతో మందికి సేవచేసే భాగ్యం తనకు దక్కిందన్నారు. భక్తులకు సేవచేసే అవకాశం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం, భక్తుల నమ్మకాన్ని నిలబెడతానని స్పష్టం చేశారు. టీటీడీ బోర్డు, అధికారులతో పాటు అందరి సలహాలు, సూచనలు తీసుకుని సమన్వయంతో ముందుకు సాగుతానన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండేలా పరిపాలన కొనసాగిస్తానని ఆయన తెలియజేశారు.

=====================

విరామం

=====================

తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం కూర్మాపురం గ్రామ పొలాలలో పులి సంచారం ఉన్నట్లు గుర్తించామని జిల్లా అటవీ శాఖ అధికారి బి. ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంట్లో దాగిన పులికి మత్తు ఇంజక్షన్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండగా, అది ఒక్కసారిగా గోడ దూకి అరటితోటలోకి పారిపోయిందని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలోని ఒక పాకలో పెద్ద పులి దాగి ఉన్నట్లు సిబ్బంది గుర్తించారని, పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఎవ్వరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. పులిని సురక్షితంగా పట్టుకునే క్యాప్చర్ ఆపరేషన్ ప్రస్తుతం కొనసాగుతోందని, ఈ ఆపరేషన్‌కు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోందని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో బయటకు వెళ్లకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి కదలికలపై అటవీ శాఖ నిరంతర నిఘా కొనసాగిస్తోందని, అవసరమైన సమాచారం అధికారికంగా మాత్రమే తెలియజేస్తామని, వదంతులను నమ్మవద్దని సూచించారు.

=====================

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రుణాల మంజూరు ప్రక్రియలో బ్యాంకర్లు మరింత ఉత్సాహంగా పాల్గొని, జిల్లా ఆర్థికవృద్ధికి తోడ్పడాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి అన్నారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో బ్యాంకర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లా యంత్రాంగంతో బ్యాంకర్లు నిరంతరం సమన్వయం చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. సరైన లబ్ధిదారులను గుర్తించి, వారికి సకాలంలో రుణాలు అందజేయడం ద్వారా వారిలో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించాలని, తద్వారా జిల్లా ఆర్థికంగా బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ప్రజల్లో ఆర్థిక క్రమశిక్షణ, ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకర్లు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

=====================

పరీక్షా పే చర్చ 9వ సంచికలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు విద్యార్థులతో సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళనను ఎలా అధిగమించాలనే విషయంపై ప్రధానమంత్రి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లాలోని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ప్రధానమంత్రి ఇచ్చిన సందేశంతో స్ఫూర్తి పొందామని ఒంగోలులోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యార్థులు పేర్కొన్నారు. ప్రతి తరగతి గదిలో డిజిటల్ తెరలను ఏర్పాటు చేసి విద్యార్థులు పరీక్షా పే చర్చ కార్యక్రమం తిలకించడానికి ఏర్పాటు చేశామని పీఎంశ్రీ జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ శివరామ్ ఆకాశవాణికి వివరించారు. ఈ కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగకరమని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన సూచనలతో రానున్న పరీక్షలలో సులభంగా రాస్తామని విద్యార్థి మహేష్ ఆకాశవాణికి వివరిస్తూ...

(వాయిస్…19 సెకన్లు)

=====================

జింబాబ్వేలోని హరారే వేదికగా జరుగుతున్న అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, ఇంగ్లాండ్ ముందు 412 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగులు చేసింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 175 పరుగులతో రాణించాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ఇంగ్లాండ్ కడపటి వార్తలు అందే సమయానికి 10 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది.

=====================

ఏప్రిల్ నుండి ప్రారంభం కానున్న వీ బి జి రామ్ జి పథకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని 20 సూత్రాల కార్యక్రమ చైర్మన్ లంక దినకర్ అన్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విద్య, వైద్యం, జలజీవన్ మిషన్, PM సూర్యగర్ పథకాలపై ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం 96 వేల కోట్ల రూపాయలు  కేటాయించిందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం కలిపితే గ్రామీణ ఆస్తుల కల్పన పెద్ద ఎత్తున జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పని దినాలు 125 రోజులకు పెంచిందని, దీనితో పారిశ్రామిక ప్రాంతమైన విశాఖపట్నం జిల్లా అభివృద్ధి రేటు ఇంకా ఎక్కువ సాధించాలన్నారు.

=====================
=====================